నీట మునిగిన పంట పొలాలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- పలు చోట్ల నిలిచిపోయిన రాకపోకలు
- కూలిన నివాసపు ఇళ్లు


నర్వశివారులో నీటమునిగిన పంట పొలాలు

సాక్షి నెట్‌వర్క్‌:జిల్లాలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో చాలా గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. అలాగే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు నిండి మత్తడి దూకుతున్నాయి. 35 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. బాన్సువాడ నుంచి కామారెడ్డికి వచ్చే రహదారిపై గాంధారి మండలం సర్వాపూర్ వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోగా, బస్సులను ఎల్లారెడ్డి మీదుగా మళ్లించారు. బాన్సువాడ పట్టణంలో ఎక్సైజ్ కార్యాలయం నీట మునిగింది. అలాగే ఇతర ప్రాంతాల్లో కూడా వాగులు పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా రాకపోకలు నిలిచిపోవడంతో జుక్కల్ నియోజకవర్గంలోని పాఠశాలలకు సోమవారం సెలవులు ప్రకటించారు. అధికారులు దగ్గరుండి సహాయక చర్యలు చేపడుతున్నారు.


వెల్లుట్ల శివారులో మునిగిన పంటలు


దుర్కి-మిర్జాపూర్ రోడ్డును బ్లాక్ చేయిస్తున్న తహసీల్దార్ సువర్ణ


వెంకంపల్లి శివారులో పంట పొలాలు..


తాటిచెట్టుగడ్డతండాలో కూలిన ఇల్లు

చుట్టుముట్టిన వరద నీరు


వరద ప్రవాహంలో ట్రాక్టర్‌పై వెళ్తున్న తహసీల్దార్, కాంగ్రెస్ పార్టీ నేతలు


జలదిగ్బంధంలో చిక్కిన బాధితులతో మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంతో పాటు ఎస్సీ కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. వర్షపు నీటితో పాటు వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో అర్ధరాత్రి నుంచి ఎస్సీ కాలనీలో 13 కుటుంబాలు బిక్కుబిక్కుమంటు నిద్రలేని రాత్రి గడిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఎస్సీ కాలనీ వాసుల గోసను మహమ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయనతో పాటు తహసీల్దార్ సవాయిసింగ్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్, గిర్దావర్ పండరి.. ట్రాక్టర్ సహాయంతో వరద ప్రవాహంలోనే ఎస్సీ కాలనీకి చేరుకున్నారు. బాధిత కుటుంబాలను ఇళ్ల నుంచి ఖాళీ చేయించి ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించారు. నిత్యవసర సరుకులను కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌రెడ్డి అందజేశారు.


నెమ్లిలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు


తిమ్మనగర్ వద్ద కాకివాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజు


బాన్సువాడలో నీట మునిగిన వరి పంట


నాగిరెడ్డిపేట సమీపంలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు


తాడ్కోల్ వద్ద రోడ్డు దాటకుండా అడ్డుపెట్టిన ట్రాక్టర్


సర్వాపూర్ శివారు పొలాల్లో వరద నీరు


మిషన్ కల్లాలి శివారులో సోయా పంటలో నీరు


పెద్దదడ్గి బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

జలదిగ్బంధంలో గ్రామాలు


తడిహిప్పర్గా వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మండలంతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో కూడా ఆదివారం నుంచి సోమవారం వరకు భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని గోజేగావ్, చిన్న టాక్లీ, పెద్ద టాక్లీ, సిర్‌పూర్, తడిహిప్పర్గా గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. సోమవారం ఉదయం నుంచి ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లెండి, మంజీర వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామాల చుట్టూ వరద నీరు చేరింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ప్రజలకు సూచించారు. తడిహిప్పర్గా వద్ద నీట మునిగిన లోలెవల్ వంతెనను ఆమె పరిశీలించారు.

తూము పరికరాలను తొలగించిన గుర్తుతెలియని వ్యక్తులు


తూముకు మరమ్మతులు చేస్తున్న రైతు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): అబ్దుల్లానగర్ శివారులోని చెరువుకు సంబంధించిన తూము పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. తూమును పగల గొట్టి ఆన్, ఆఫ్ చేసే ఇనుప రాడ్లు, ప్లేట్లను తొలగించి బయట పడవేశారు. దీంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి చెరువులోకి వచ్చిన నీరంత చెరువు కింద ఉన్న పొలాల్లోకి వెళ్లాయి. ఇది గమనించిన రైతులు సోమవారం చెరువు వద్దకు వెళ్లి తూం మరమ్మతులు చేసి నీరు పోకుండా చర్యలు తీసుకున్నారు.

ఫీడర్ చానల్‌కు గండి


అయ్యపల్లి శివారులో ఫీడర్ చానల్‌కు గండి పడి వృథాగా పోతున్న నీటి వద్ద రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): భారీ వర్షానికి లింగంపేట మండలం శెట్పల్లి, ఆయ్యపల్లి, అయ్యపల్లి తండాల శివారులో ఉన్న దేవుని చెరువులకు వచ్చే ఫీడర్ చానల్ కాలువకు గండిపడి వరద నీరు వృథాగా పోతున్నట్లు ఆయకట్టు రైతులు తెలిపారు. ఫీడర్ ఛానల్ ద్వారా ఆయా గ్రామాల శివారులోని ఆరు చెరువుల్లోకి నీరు వచ్చి చేరేది. దాంతో ఆయా గ్రామాలు పంటలతో సస్యశ్యామలమవుతాయని రైతులు పేర్కొన్నారు. కాల్వకు గండిపడటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కుంగుతున్న కట్ట



బాన్సువాడ రూరల్: మండలంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువకు అనుబంధంగా ఉన్న 11వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వద్ద కట్ట కుంగుతోంది. స్వల్పంగా మట్టి కిందికి జారడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నీటిపారుదల శాఖ ఏఈ ఆదిత్య నితిన్ ప్రధాన కాలువకట్టను పరిశీలించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, లస్కర్లకు నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కూలిన వాటర్ ట్యాంకు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణ శివారులోని డబుల్‌బెడ్ రూం సముదాయంలో ఓ ఇంటిపై గల వాటర్ ట్యాంకు సోమవారం కూలింది. 15వ బ్లాక్‌లో ఇంటిపై నిర్మించిన వాటర్ ట్యాంకు కూలింది. పైన ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి వాటర్ ట్యాంకుకు మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేదు

మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బాన్సువాడ: బీసీ రిజర్వేషన్ల విషయంలో సీఎంకు చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. సోమవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రితో మాట్లాడదామని చెప్పి.. అఖిలపక్షాన్ని తీసుకెళ్లకుండా.. కాంగ్రెస్ పార్టీ వాళ్లను వెంట బెట్టుకుని వెళ్లి ఢిల్లీలో ధర్నా చేసినా సొంత పార్టీ అగ్రనేతలు రాకపోవడం శోచనీయమని అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్.. పదవులు పోతాయని భయంతో ఏ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు ఆ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారని, సానుభూతిపరులు తప్ప వారు పార్టీలో చేరలేదని ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. మీకు ధైర్యం ఉంటే కాంగ్రెస్ పార్టీలో చేరామని పార్టీ మారిన ఎమ్మెల్యేలు చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉందని.. గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకో రెండేళ్లలో మునిగిపోతుందన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు ఎర్రవాటి సాయిబాబా, మోచీ గణేష్, చందర్, మల్లేశ్ గౌడ్, గాండ్ల కృష్ణ, శివ, రమేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ మహాధర్నా పోస్టర్ల ఆవిష్కరణ



రాజంపేట:పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సీపీఎస్‌పై ఇందిరా చౌక్(హైదరాబాదు) వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ రాజంపేట మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ మహాధర్నాకు మండలంలోని ప్రతి సీపీఎస్ ఉద్యోగి హాజరై విజయవంత చేయాలని పిలుపునిచ్చారు.ఎంఈవో పూర్ణచంద్రరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్,మండల అధ్యక్షులు సంతోష్ కుమార్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,రాష్ట్ర,జిల్లా,మండల బాధ్యులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో..



కామారెడ్డి టౌన్: హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే సీపీఎస్ మహా ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలో పీఆర్‌టీయూ అర్బన్, మండల శాఖల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ అర్బన్, మండల అధ్యక్షులు హన్మాండ్లు, రమణ, ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు, స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ సేవలు మరువలేనివి


కలెక్టరేట్‌లో నిర్వహించిన పాపన్న జయంతికి హాజరైన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు


పిట్లంలో ..గౌడ సంఘం సభ్యులు


లింగంపేటలో ..

సాక్షి నెట్‌వర్క్‌:సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని జిల్లా వ్యాప్తంగా గౌడ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో పాటు ఇతర అధికారులు హాజరై పాపన్న గౌడ్ చేసిన సేవలను కొనియాడారు.


రామారెడ్డిలో..


మాందాపూర్‌లో ..

అధ్వానంగా తయారైన బీటీ రోడ్డు



మండలంలోని ఘన్‌పూర్(ఎం)లో తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుపై నీరు నిలిచి దెబ్బతింటోంది. రూ.లక్షలు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నా, వర్షపు నీరు డ్రెయినేజీలకు వెళ్లే దారి చూపకపోవడంతో నీరంతా రోడ్డుపై నిలిచిపోయి రోడ్డు దెబ్బతింటోందని గ్రామస్తులు వాపోతున్నారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అర్హులకు రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోండి



ఎల్లారెడ్డిరూరల్: నియోజకవర్గంలో అర్హులందరికి రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సోమవారం సివిల్ సప్లయ్ కమిషనర్ దేవేందర్ చౌహాన్‌ను కోరారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలో మిగిలిన అర్హులకు కార్డులను అందేలా చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు.

టీఎల్‌ఎంలను వినియోగించాలి



ఎల్లారెడ్డిరూరల్: ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలను బోధించే సమయంలో టీఎల్‌ఎంలను వినియోగించాలని ఎంఈవో రాజులు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) మేళాను ఆయన పరిశీలించారు. వివిధ పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్‌ఎంలను ఆయన పరిశీలించారు. అత్యుత్తమ టీఎల్‌ఎంను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. హెచ్‌ఎంలు వెంకటేశ్వర్‌రావు, శివనర్సింహారావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

కృత్రిమ మేధతో వ్యవసాయ పనులకు మేలు

ఎల్లారెడ్డి: కృత్రిమ మేధతో వ్యవసాయ రంగంలో ఎంతో అభివృద్ధి జరుగుతుందని బ్లూరిబ్బన్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కృత్రిమ మేధ గురించి అవగాహన కల్పించారు. కృత్రిమ మేధ వల్ల వ్యవసాయ రంగంలో ఎంతో అభివృద్ధిని సాధించవచ్చని, డ్రోన్ల వినియోగం ద్వారా మందుల పిచికారీతో పాటు వ్యవసాయ పనులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడం ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని అన్నారు. ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు తదితరులున్నారు.

మురికి కాలువ శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

దోమకొండ: సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ' కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురికి కాలువలను శుభ్రం చేయించారు. అదేవిధంగా ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను చూసి ఆ స్థల యజమానులకు నోటీసులను జారీచేసినట్లు పంచాయతీ కార్యదర్శి యాదగిరి తెలిపారు. పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పరిశీలించారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



కామారెడ్డి టౌన్: నేషనల్ స్పేస్ ఐడియాతన్ వికసిత్ భారత్ ఐబీటీ, ఇస్రో తిరుపతి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగిన స్పేస్ టెక్నాలజీస్, అప్లికేషన్స్ ఎర్త్-2005 జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఎస్వీఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థులు కౌశిక్, రాణామహదేవ్‌లు ప్రదర్శించిన స్మార్ట్‌బిన్ క్యూఆర్ కోడ్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారుతి సోమవారం విద్యార్థులను అభినందించారు.

క్రీడా దుస్తులు, బూట్ల పంపిణీ

కామారెడ్డి అర్బన్: ఎస్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు ద్వారా కామారెడ్డి మండలం గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందిరానగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, దేవునిపల్లి కాకతీయనగర్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు దాదాపు రూ.2 లక్షల విలువైన క్రీడా దుస్తులు, బూట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి శ్రీవారి భారతి, ఎంఈవో ఎల్లయ్య, సీఆర్‌పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేల విరాళం

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో అన్న ప్రసాదం వితరణకు హైదరాబాద్‌కు చెందిన నీల వెంకటేశం రూ.25వేలను సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశంను ఆలయ ఈవో శ్రీధర్ సన్మానించారు. కార్యక్రమంలో పూజారి రాజేశ్వరశర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చీకోటి ప్రభాకర్, గంగెల్లి జగదీశ్వర్, కల్లూరి సిద్ధరాములు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యుత్ స్తంభాలను తాకొద్దు

ఎల్లారెడ్డి: విద్యుత్ స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలని విద్యుత్ శాఖ డీఈ విజయసారథి అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఇళ్లలో స్విచ్‌లు వేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పొలంలో రైతులు బోరు స్టార్టర్ల వద్ద చేతితో స్విచ్‌ను ఆన్ చేయవద్దని, కర్ర వాడాలని అన్నారు. ఫ్యూజులు మార్చే సమయంలో తగిన చర్యలను తీసుకోవాలన్నారు. విద్యుత్ షాక్‌కు గురికాకుండా చూసుకోవాలని అన్నారు.

అందుబాటులో వ్యవసాయ పరికరాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులకు అవసరమగు వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రజాపతి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిన్న, సన్న, ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులకు 50 శాతం, ఏ రైతుకైనా 40 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇవే కాకుండా ఇంకా రైతులకు ఇతర వ్యవసాయ యంత్ర సామగ్రి అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు

బాన్సువాడ రూరల్: వర్షాలు తగ్గుముఖం పట్టి, వరదలు ఆగే వరకు మత్స్యకారులు చెరువులు, కుంటల్లో చేపల వేటకు వెళ్లవద్దని బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్ సూచించారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లోని చెరువులను పరిశీలించారు. అన్ని చెరువులు నిండుకుండల్లా ఉన్నాయన్నారు. బోర్లం గ్రామ తోరచెరువు వద్ద మత్స్యకార్మికులకు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లల్లో ఉండొద్దు

బాన్సువాడ రూరల్: భారీ వర్షాలకు కూలిపోయే స్థితిలో ఉన్న పాత ఇళ్లలో ప్రజలు నివాసం ఉండరాదని బోర్లం గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ సూచించారు. నివాసాన్ని వేరేచోటుకి మార్చాలని సూచించారు.

వైశ్యసంఘాల ఆధ్వర్యంలో సామాజిక సేవ

భిక్కనూరు: వైశ్య సంఘాల ఆధ్వర్యంలో సామాజిక సేవ అందిస్తున్నట్లు కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు మొగిలిపల్లి భూమేష్ గుప్తా అన్నారు. సోమవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు ప్రజలకు సేవలు అందించడంలో ముందున్నారన్నారు. ఆర్యవైశ్యులు సనాతన ధర్మ పరిరక్షణకు ముందుంటారని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో ఆర్యవైశ్యులు అవకాశం ఉన్న చోట పోటీ చేస్తారన్నారు. ఆర్యవైశ్యుల కులదేవత వాసవీమాత జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించేవిధంగా ప్రభుత్వానికి వినతి పత్రం అందజేస్తామన్నారు. ప్రతినిధులు మురంశెట్టి రాములు, లింగం, పురాం రాజమౌళి, కాపర్తి శ్రావణ్‌కుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్నూర్, దొంగ్లీ మండలాల్లో విద్యా సంస్థలకు సెలవు

కామారెడ్డి టౌన్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అత్యధిక వర్షపాతం కలిగిన డొంగ్లీ, మద్నూర్ మండలాలలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో ఎస్.రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు మంగళవారం మూసి వేయాలని, విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని డీఈవో సూచించారు.